క్లుప్తంగా

గురప్పగారిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్

పోరుమామిళ్ల : రంగసముద్రం 2వ సచివాలయం పరిధిలోని గురప్పగారిపల్లెలో సోమవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవిద్య ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, అబ్జర్వర్ స్వామిరంగయ్య, ఏఎన్ఎం అన్నపూర్ణ, డీఈఓ విష్ణువర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలు అందిస్తామన్నారు.

స్పోకెన్ ఇంగ్లీషులో తర్ఫీదు

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణలో భాగంగా పిల్లలకు స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్‌లో రిటైర్డు ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చినట్లు గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం పిల్లలకు క్యారంబోర్డు, చెస్, కథల పోటీలు నిర్వహించారు. ఈ శిక్షణలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు

రాజుపాళెం : వేసవి శిక్షణలో భాగంగా మండల కేంద్రమైన రాజుపాళెంలోని గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు కథల పోటీలను గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కథల పోటీలో పాల్గొనడం వల్ల కథలలోని నీతి తెలుస్తుందని, అలాగే జ్ఞాపక శక్తి పెరుగుతుందని తెలిపారు.

స్పందనతో సమస్యల పరిష్కారం

కాశినాయన : స్పందన కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించుకోవచ్చని మండల ప్రత్యేకాధికారి నాగభూషణం, ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, తహసీల్దార్ రామచంద్రుడు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గొంటువారిపల్లె సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్ల అరెస్టు దారుణం

బద్వేలు అర్బన్ : లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌శరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని ఢిల్లీ నడిబొడ్డున శాంతియుతంగా నిరసన చేస్తున్న మహిళా రెజ్లర్లను అరెస్టు చేయడం దారుణమని డీవైఎఫ్ఐ పట్టణ మహిళా కన్వీనర్ గురుదేవి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశ రాజధానిలో గత 30 రోజులుగా మహిళా రెజ్లర్లు ఆందోళన చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ మహిళా కో కన్వీనర్ నాగేశ్వరి, పట్టణ నాయకులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమం

బద్వేలు అర్బన్ : బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఇంటింటికి బీఎస్పీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి ఆదేశాల మేరకు చేపట్టనున్న ఇంటింటికి బీఎస్పీ కార్యక్రమంలో కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి బీఎస్పీ సిద్ధాంతాలను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జయరామ్, జిల్లా ఇన్‌చార్జి సగిలిగురప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబయ్య, ఉపాధ్యక్షుడు బాలచంద్ర, నియోజకవర్గ అధ్యక్షుడు గౌస్‌పీర్, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు వలంటీర్లకు వందన కార్యక్రమం, 3.30 గంటలకు కానాల కల్యాణ మండపంలో చుక్కల భూములకు సంబంధించిన పట్టాలను రైతులకు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చేతుల మీదుగా అందించనున్నట్లు ఎమ్మెల్యే పీఏ రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఐటీ సలహాదారు



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఐటీ సలహాదారు శేషిరెడ్డి

బద్వేలు అర్బన్ : బద్వేలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ఐటీ సలహాదారు పాటూరు శేషిరెడ్డి తనిఖీ చేశారు. గత కొద్ది రోజులుగా రిజిస్ట్రేషన్ల విషయంలో జరుగుతున్న సాంకేతిక కారణాలను అడిగి తెలుసుకుని సరిచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా నిరంతరాయ సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. సబ్ రిజిస్ట్రార్ డి.మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మోసపూరిత హామీలను నమ్మవద్దు

- 2014 ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన చంద్రబాబు
- భారీ బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



మైదుకూరులో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు (ఇన్‌సెట్) కూశెట్టి రాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

దువ్వూరు/చాపాడు/మైదుకూరు/ఖాజీపేట : టీడీపీ అధినేత చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన పాత దువ్వూరులోని ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర నుంచి ఖాజీపేట వరకు భారీ బైక్ ర్యాలీని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాజమండ్రిలో నిర్వహించిన మహానాడులో ప్రకటించిన తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టో మోసపూరితమైనదన్నారు. 2014 ఎన్నికల్లో మోస పూరిత హామీలను ప్రజలకు ఇచ్చి అధికారం చేపట్టాక ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. ముఖ్యంగా రైతులను, మహిళలను దారుణంగా మోసగించారన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఎన్ని కూటములతో కలిసి వచ్చినా ఆయన ఓటమి తథ్యమని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 90 శాతం నెరవేర్చారని, 2024 ఎన్నికల్లో జగన్‌ను తిరిగి సీఎంగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. తప్పుడు హామీలతో మరొకసారి ప్రజల ముందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తమై చంద్రబాబును ఓడించాలని పేర్కొన్నారు.

యువగళం అంతా పెయిడ్ ఆర్టిస్టులు

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో ప్రజలు పాల్గొనేందుకు ఆసక్తి చూపడం లేదని ఎమ్మెల్యే అన్నారు. అందుకే అంతా పెయిడ్ ఆర్టిస్టులతో యాత్ర సాగుతోందన్నారు. కాగా ర్యాలీలో పాల్గొన్న దాదాపు ఐదువేల మందికి పుల్లూరు మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పుల్లూరు గ్రామంలో నూతన సచివాలయాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రారంభించారు.

మైదుకూరులో మున్సిపల్‌చైర్మన్ మాచనూరు చంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి తదితరులు ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ఘన స్వాగతం పలికి ఆయనకు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో దువ్వూరు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, మైదుకూరు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఖాజీపేట మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్ హుసేన్, పుల్లూరు పంచాయతీ నాయకుడు వీరారెడ్డి, పుల్లూరు సర్పంచ్ పల్లె యేసురత్నం, ఆంజనేయకొట్టాలు సర్పంచ్ పెద్దిరెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు: మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సోమవారం మానవత్వం చాటుకున్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీలో పాల్గొన్న మైదుకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కూశెట్టి రాయుడు బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కాలుకు స్వల్ప గాయమైంది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ర్యాలీని కాసేపు ఆపించి రాయుడును పరామర్శించి పోలీసుల ద్వారా తన ప్రైవేటు వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

పేదలను కించపరిచే విధంగా మాట్లాడటం తగదు

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పేదల సొంతింటి కలను నెరవేర్చుతోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఈ విధానాన్ని అభినందించాల్సింది పోయి పేదలకు ఇచ్చే ఇంటి స్థలాలు శవాలను పూడ్చడానికి కూడా పనికిరావని విమర్శించడం తగదన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు అన్వర్ థియేటర్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది అని అన్నారు. ఈ కారణంగానే చంద్రబాబు పేదలను విమర్శించారన్నారు. నియోజకవర్గ పరిధిలో గత ఐదేళ్ల కాలంలో ఒక్కరికి కూడా ఇల్లు నిర్మించి ఇవ్వలేదని, తమ ప్రభుత్వ హయాంలో 24వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, నాగరాజు, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, నాగేంద్రారెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, ఇర్ఫాన్ బాషా, కమాల్, సత్యం, 25వ వార్డు ఇన్‌చార్జి నూరి, మార్కెట్ దాదాపీర్, జాఫర్, కరీముల్లా, బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు, గోపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, స్నూకర్ భాస్కర్, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల కన్వీనర్ రాజారాం రెడ్డి, కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ యెల్లాల కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వలంటీర్లు సేవా వారధులు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్లు సేవా వారధులని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 23 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, నేడు ఆ పరిస్థితి లేకుండా అర్హత ఉన్న లబ్ధిదారుల వద్దకే వలంటీర్లు వెళ్లి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. అనంతరం ఐదుగురు వలంటీర్లకు సేవారత్న, 306 మంది వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలు అందజేసి ప్రశంసాపత్రాలను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి , ఆయా వార్డుల ఇన్‌చార్జిలు శివయ్య, బిజ్జం రమణ, అనిల్, మౌలాలి, షఫి, రజనికాంత్, కౌన్సిలర్లు సత్యనారాయణ, వరలక్ష్మి, ఉమ, రాజేశ్వరి, రమాదేవి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, మేనేజర్ మునికుమార్, డీఈ సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

బి.కోడూరు : పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తంగేడుపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ఆ కుటుంబానికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరాలు వెల్లడిస్తూ వారికి బుక్‌లెట్‌ను అందించారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అన్ని శాఖల అధికారులతో కలిసి ఇంటింటికి వచ్చి ప్రజల యోగక్షేమాలను తెలుసుకోవడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేకత అన్నారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ యోగానందరెడ్డి, సర్పంచ్‌లు జయరామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, తహసీల్దారు విద్యాసాగర్, సీఐ హనుమంత నాయక్, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కళ్లముందు చేసిన అభివృద్ధి కనిపిస్తున్నా .. అభివృద్ధే జరగనట్లు తప్పుడు కథనాలు ప్రచురించడం దారుణమని, ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ఓ దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. బద్వేలు నియోజకవర్గంలో నాడు–నేడు తరహాలో 2019 తర్వాత ఎంతో అభివృద్ధి జరిగి బద్వేలు ముఖచిత్రమే మారిందన్నారు. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీకి ఇవ్వని విధంగా బద్వేలు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.130 కోట్లు మంజూరు చేస్తే అందులో రూ.50 కోట్లతో సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు కూడా త్వరలోనే మొదలవుతాయని తెలిపారు. అంతేకాకుండా 14, 15 ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలోని చాలా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఏర్పాటయ్యాయని, ఇదంతా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే జరిగిందని అన్నారు. 13 పడకల ఆసుపత్రిగా ఉన్న ప్రభుత్వాసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా మార్చడంతో పాటు దివంగత ఎమ్మెల్యే డాక్టర్ వెంకటసుబ్బయ్య కృషితో బీహెచ్‌ఈఎల్ సంస్థ రూ.2 కోట్ల వ్యయంతో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, త్వరలోనే దానిని ప్రారంభించబోతున్నామని తెలిపారు. అంతేకాకుండా నియోజకవర్గంలో రూ.10 కోట్ల వ్యయంతో 5 సబ్‌స్టేషన్లు నిర్మిస్తుండగా తాజాగా మరో 3 సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. బ్రహ్మంసాగర్ లీకేజీలను అరికట్టి 17 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేందుకు రూ.45 కోట్లతో డయాఫ్రమ్‌వాల్ నిర్మించనున్నారని, ఇది కూడా ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే మంజూరైందని తెలిపారు. రూ.25 కోట్లతో పోరుమామిళ్ల పట్టణంలో నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయని, పట్టణంలోని చెన్నంపల్లె సమీపంలో ఆదిచెన్నకేశవ స్వామి ఆలయాన్ని రూ.కోటి వ్యయంతో సుందరంగా తీర్చిదిద్దారని, అలాగే రూ.64 లక్షలతో లక్ష్మీపాలెం వేంకటేశ్వరస్వామి గుడికి కూడా మరమ్మతులు జరుగుతున్నాయని, ఇవన్నీ కూడా ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరుగుతున్నవేనని వివరించారు. వీటితో పాటు బద్వేలు రెవెన్యూ డివిజన్ హోదా కల్పించడంతో పాటు సచివాలయాలు, డిజిటల్ లైబ్రరీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మాణాలు పూర్తయి ప్రజలకు అందుబాటులో ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.

అర్జీదారులను సంతృప్తి పరచాలి



బ్రాహ్మణపల్లె సచివాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ దామోదర్‌రెడ్డి

గోపవరం : వివిధ సమస్యలపై స్పందనలో ఇచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులను సంతృప్తి పరచాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ అన్నారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి ఆయన స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమశిల వెనుకజలాల కింద ముంపునకు గురైన సూరేపల్లె దళితవాడ బాధితులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి అధికారులకు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత ఉండి ఇళ్లు లేని వారు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, ఏఓ అరవిందనాయక్, ఈఓపీఆర్‌డీ హసీనా, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశంగా కొనసాగించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పదో తరగతి పాఠ్యాంశంగా కొనసాగించాలని జేవీవీ ముద్రించిన కరపత్రాలను స్థానిక శివాలయం రోడ్డులోని వేమన విగ్రహం వద్ద సోమవారం జేవీవీ నాయకులు విడుదల చేశారు. అనంతరం జేవీవీ కార్యాలయంలో రాష్ట్ర యూత్ నాయకుడు మహేష్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు మాట్లాడుతూ డార్విన్ పాఠాలను తొలగించడం, విజ్ఞాన్ ప్రసార్‌ను మూసివేయడం లాంటి చర్యల ద్వారా సైన్స్‌ను తొక్కిపెట్టడం 21వ శతాబ్దంలో వీలుకాదన్నారు. అంతిమ విజయం సైన్స్‌దే అని తెలిపారు. పట్టణ కార్యదర్శి కళ్యాణ్‌కృష్ణ, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, న్యూ ఆంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి న్యామతుల్లా, వేమన సంస్థ అధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

కలసపాడు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చెన్నుపల్లె గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. బద్వేలు నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారానికి కలసపాడు మండలానికి వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడిగా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తిప్రకాశ్‌రెడ్డిని నియమించారు. ప్రచారంలో భాగంగా చెన్నుపల్లె గ్రామానికి ఆయన వెళ్లారు. అక్కడి ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన ఈ విషయాన్ని మండలంలోని తంబళ్లపల్లెకు చెందిన తన మిత్రుడైన వేణుమాధవ్‌రెడ్డికి తెలిపారు. దీంతో ఆయన సుమారు రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం వేణుమాధవ్‌రెడ్డి, ఆయన తండ్రి కొండా బాలఅంకిరెడ్డి, స్థానిక సర్పంచ్ ఎం.నవీన్‌కుమార్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు.

సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రొద్దుటూరు : సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు ఏపీ శానిటరీ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీస్ అసోసియేషన్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయపాలన అమలు చేయకుండా సస్పెండ్‌ల పేరుతో అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు చెత్త పన్ను కట్టకపోతే సెక్రటరీల జీతంలో నుంచి కట్టాలని వేధించడం ఎంత వరకు సమంజసమన్నారు. జాబ్ చార్ట్ అమలు చేయకుండా వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల : తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ రంగసముద్రం పొలం 1263 సర్వే నంబర్‌లో 331 మంది మిలిటరీ సిబ్బందికి ఇంటి పట్టాలు ఇచ్చారని, అయితే కొంతమంది మిలిటరీ వారు ఖాళీ స్థలాలు ఆక్రమించుకుని అమ్ముకుంటున్నారన్నారు. అక్కడ 15 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల గుడిసెలను కూలదోసి ఆ స్థలాలు ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు విచారణ జరిపి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌసియాబేగం, రవి, శ్రీను, లూర్దు మేరి, బాలగురయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు పరిష్కారం తప్పనిసరి

బ్రహ్మంగారిమఠం : స్పందనలో ప్రజలు ఇచ్చిన ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం ఉంటుందని ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా తెలిపారు. సోమవారం మల్లేపల్లెలో ఏర్పాటు చేసిన స్పందనలో పాల్గొన్న ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో వివిధ రకాల ఫిర్యాదులు దాదాపు 59 వచ్చాయన్నారు. వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ప్రభుత్వం ద్వారా వచ్చేలా చూడాలని ట్రైనీ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి, ఉపసర్పంచ్ చీలేకాంపల్లె కొండారెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, వీఆర్ఓ ఓబయ్య, గ్రామ సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అధికారం కోసమే చంద్రబాబు హామీలు

సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ

బద్వేలు అర్బన్ : ఇచ్చిన హామీలను సైతం అమలు చేయని చంద్రబాబు అధికారం కోసం మళ్లీ ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని సగర, ఉప్పర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంట రమణమ్మ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు బంగారు శీనయ్య పేర్కొన్నారు. సోమవారం బద్వేలులోని వారి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అమ్మఒడి పథకాన్ని కాపీ కొట్టి తల్లికి వందనం పేరుతో అమలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబునాయుడు గతంలో ఇచ్చిన పసుపు–కుంకుమ, రైతు రుణమాఫీ హామీలు ఏ మేరకు అమలయ్యాయో ప్రజలందరికి తెలుసన్నారు.

చంద్రబాబు మాటలను నమ్మేదెవరు?

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



చంద్రబాబు మాటలు నమ్మవద్దంటున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చి అమలు చేయని చంద్రబాబు మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన టీడీపీ మహానాడులో మరోమారు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. విశ్వసనీయతకు మారుపేరు నేడు జగన్, నిన్న వైఎస్ అయితే, వంచనకు మారుపేరు చంద్రబాబు అని అన్నారు. రాజమహేంద్రవరంలో జరిగింది మహానాడు కాదని, బూతు నాడు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నోటికొచ్చినట్లు ముఖ్యమంత్రి జగన్‌తోపాటు రాష్ట్ర మంత్రులను విమర్శించారన్నారు. సాధారణ నాయకులే కాకుండా మాజీ మంత్రులు సైతం ఇలా మాట్లాడటం తగదన్నారు.

2014 ఎన్నికల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మహిళలను మోసగించిన చంద్రబాబు మాటలను నమ్మే పరిస్థితి లేదన్నారు. రైతు రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఇప్పుడు మళ్లీ రైతులకు సాయం చేస్తానంటే నమ్ముతారా అన్నారు.

చంద్రబాబు హామీలకు గ్యారెంటీ ఎవరు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారమే లక్ష్యంగా ఇచ్చిన హామీలకు గ్యారెంటీ ఎవరని ఎమ్మెల్యే రాచమల్లు ప్రశ్నించారు. గతంలో ఆయన ఇచ్చిన హామీలు అమలు కాకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేస్తాడో లేదో తన నియోజకవర్గంలో లోకేష్ ప్రకటించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలానికి ఏటా రూ.4లక్షలు అద్దె చెల్లిస్తా

ప్రొద్దుటూరు : త్వరలో ఏర్పాటు చేయనున్న రాచమల్లు రాజన్న భోజనం కార్యక్రమ నిర్వహణ కోసం మున్సిపల్ పెట్రోలు బంకు వద్ద ఉన్న స్థలాన్ని లీజుకు తీసుకున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయం సభాభవనంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అన్నదానం ఏర్పాటుకు సంబంధించిన మున్సిపల్ స్థలాన్ని లీజుకు ఇచ్చే అంశంపై అజెండాలో పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా రూ.4లక్షలు మున్సిపాలిటీకి అద్దె కింద చెల్లిస్తామన్నారు. చంద్రబాబు హయాంలో అన్న క్యాంటిన్లను ఏర్పాటు చేసి టీడీపీ నాయకులు డబ్బు దండుకోవడం తోపాటు పబ్లిసిటీ చేసుకున్నారన్నారు. తాను సొంత ఖర్చుతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. 17వ వార్డు కౌన్సిలర్ చింతకుంట సరితా రెడ్డి తన వార్డు పరిధిలోని కాలువ సమస్యను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి తెలపగా, త్వరగా సమస్యలను పరిశీలించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన రుసుమును మిగతా మున్సిపాలిటీల్లోలాగే పెంచాల్సిన అవసరం ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. మున్సిపల్ గాంధీ పార్కులో ప్రవేశం ఉచితమని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్‌ఖాజా, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.